## క్లుప్తంగా

### పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పల్నాడు జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు

**పిడుగురాళ్ల:** సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై పోలీసులు నిత్యం నిఘా ఉంచాలన్నారు. అంతేకాకుండా బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ప్రయాణికులకు భద్రత కల్పించాలని, వారి సామగ్రి జాగ్రత్తగా ఉంచుకునే విధంగా పోలీసులు వారికి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సంక్రాంతి పండగ సందర్భంగా పేకాట, కోడి పందేలు వంటి జూదాలు నిర్వహించకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

### నేడు రెండు రాష్ట్రాలస్థాయి సినీ పాటల పోటీలు

**మాచర్ల రూరల్:** తెలుగు వారి ప్రధాన పండుగ సంక్రాంతిని పురస్కరించుకొని ఈ నెల 12న లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 'మనమూ పాడుదాం' సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ ముటుకుల కమలాసన్‌రావు శనివారం తెలిపారు. తెలుగువారి సాంప్రదాయాలను, సాంస్కృతిక కార్యక్రమాలను మరువకుండా గత 22 సంవత్సరాలుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మానుకొండ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాల్గొనే అభ్యర్థులు ఉదయం 10గంటలకు జరిగే సెలక్షన్‌కు హాజరు కావాలన్నారు. వివరాలకు 9441065681 నెంబరులో సంప్రదించాలన్నారు.

### అంటువ్యాధులపై అవగాహన అవసరం

**గురజాల రూరల్:** ప్రతిఒక్కరూ అంటువ్యాధులపై అవగాహన కలిగి వుండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీము జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో పనిచేస్తోందని, హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. డాక్టర్ బిందు మాధవి, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూపరాణి, నాయకులు ఉల్లి ఆంజనేయులు, పి.మరియబాబు, పెద్ద చౌడయ్య, ఏఎన్‌ఎం సుజాత, ఆశావర్కర్లు, లింక్ వర్కర్ కమల పాల్గొన్నారు.

### భక్తుల పాదయాత్ర



**మాచర్ల:** మాచర్ల మండలంలోని భైరవునిపాడు గ్రామం నుంచి మాచర్ల పట్టణం వరకు వేంకటేశ్వరస్వామి నామస్మరణతో 60 మంది భక్తులు పాదయాత్ర నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి అర్చన కార్యక్రమాలు నిర్వహిస్తూ దేవాలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భైరవునిపాడు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

### ధనుర్మాస ప్రత్యేక పూజలు

**మాచర్ల:** ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన, స్వామివారి పారాయణం, గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడిగొప్పల చెన్నకేశవచారీలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పారాయణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో దేవాలయం కిటకిటలాడింది.

### సొంతూర్లకు పయనం

రోడ్లపై భారీగా వాహనాల రద్దీ



**దాచేపల్లి:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు సొంతూర్లకు పయనమయ్యారు. హైదరాబాద్ నుంచి దాచేపల్లి మీదుగా నరసరావుపేట, పిడుగురాళ్ల, గుంటూరు, ఒంగోలు, వినుకొండ, చిలకలూరిపేట, చీరాల ప్రాంతాలకు భారీగా శనివారం తరలివెళ్లారు. శని, ఆదివారాలు సెలవులు కావటంతో ముందుగానే సంక్రాంతి పండుగకు ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నగరం నుంచి భారీగా కార్లు దాచేపల్లి వైపునకు వచ్చాయి. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌తో పాటుగా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అద్దంకి –నార్కెట్‌పల్లి హైవేపై వాహనాల రద్దీ భారీగా కనిపించింది. కార్లు, ప్రైవేట్ వాహనాలు, ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సొంత ఊళ్లకు చేరుకుంటున్నారు.

### భద్రత నియమాలు పాటించాలి




**సత్రశాల(రెంటచింతల):** కర్మాగారాలలో పనులు చేసే సమయంలో కార్మికులు భద్రతా నియమాలు పాటిస్తూ... విధులు నిర్వహించాలని పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్లాంట్ హెడ్ వి.సి.వర్క్స్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం సత్రశాల సమీపంలో నున్న పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో నిర్వహించిన 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 11 నుంచి 17 వ తేదీ వరకు ఫ్యాక్టరీ ఆవరణలో రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత భద్రతా జెండాను ఎగురవేసి కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఫ్యాక్టరీ అధికారులు, కార్మికులు, డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు మొక్కలు నాటే కార్యక్రమం

**గురజాల:** మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెల్ఫేర్ ఆర్గనైజర్ టిక్కి అలేఖ్య వరప్రసాద్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటామన్నారు. మొక్కల్ని డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు ఉచితంగా ఇస్తున్నారన్నారు. మొక్కల్ని రక్షించడానికి ట్రీ గార్డ్స్‌ని మహిమ ఆశ్రిత ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ , గ్రామస్థుడు గంధం నాగేశ్వరరావుతో పాటు వెల్ఫేర్ వారి సహకారంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మన ఊరు కోసం సమాజ శ్రేయస్సు కోసం అందరూ కలిసి మొక్కలు నాటుదాం అందరం కలిసి, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

# సంక్రాంతి సంబరాలు ప్రారంభం

- గ్రామాల్లో సందడి చేస్తున్న హరిదాసులు
- రంగవల్లులతో మనోహరంగా వీధులు



సంక్రాంతి ముగ్గుతో అలరారుతున్న వీధి



వీధుల్లో డూడూ బసవన్నల సందడి



హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళ

**మాచర్ల రూరల్:** తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఆరుగాలం శ్రమించే రైతన్న శ్రమ పంట ఇంటికి చేరి కుటుంబ సభ్యులంతా ఒక్కచోటకు చేరి మూడు రోజుల పాటు నిర్వహించుకునే పండుగ సందడి పల్లె, పట్టణాలలో మొదలైంది. సంక్రాంతి అంటే మొదట గుర్తొచ్చేది హరిదాసులు హరినామ సంకీర్తనలు పాడుతూ హరిదాసులు గ్రామాల్లో సంచరిస్తున్నారు. డూడూ బసవన్నలతో విన్యాసాలు చేస్తూ గంగిరెద్దుల వారు అంబ పలుకు.. జగదాంబ పలుకు అంటూ శంఖం ఊదుతూ వీధుల్లో కనిపిస్తున్నారు. సంక్రాంతి సాంప్రదాయాలను మరువకుండా పల్లె, పట్టణ ప్రజలు హరిదాసులకు, గంగిరెద్దుల వారికి తులమో ఫలమో ఇచ్చి సాంప్రదాయ కళలకు జీవం పోస్తున్నారు.

**ముందస్తు సంక్రాంతి సంబరాలు**

**గురజాల:** పండుగలు మన సంప్రదాయాలకు ప్రతీకలని ప్రిన్సిపాల్ దాసిరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. స్థానిక జె.ఆర్.ఆర్. నవోదయ జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి, కనుమ, సంక్రాంతి పండుగల ప్రాముఖ్యతను వివరించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. డైరెక్టర్లు పోలు కోటిరెడ్డి, గంటా కిషోర్ కుమార్, పేరం వెంకటేశ్వరరెడ్డి లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



నవోదయలో భోగి మంట వేసిన విద్యార్థులు

**పల్నాడు జూనియర్ కళాశాలలో ..**

**మాచర్ల:** పల్నాడు జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, పిండి వంటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. కళాశాల సెక్రటరీ పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను ఇతర దేశాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. భోగి మంటల కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివభాస్కర్, కళాశాల చైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు మర్రె వెంకటనారాయణ, ఇరువంటి ఆంజనేయ శాస్త్రి, మస్తాన్ వలి, ఉపాధ్యాయులు రాధ, రబ్బానీ, కాశి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



**పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల పట్టణంలోని స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సినిమాహాల్ సెంటర్ నందు గల ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చేసిన సేవలను ఎప్పటికీ మరిచిపోకూడదని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య, మాజీ కౌన్సిలర్లు వేముల సాంబయ్య, కౌన్సిలర్లు తురకా ముక్కంటి, నాయకులు ఇర్లా గురుస్వామి, రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు దేవళ్ల నాగరాజు, గోగుల వెంకటేశ్వర్లు, నారాయణ, బండారు నాగేశ్వరరావు, చల్ల నాగేశ్వరరావు, బండారు అంజి, కందులూరి శ్రీను తదితరులు ఉన్నారు.

### ఫిబ్రవరి 2న కోటి నామోత్సవం

**మాచర్ల:** పరబ్రహ్మ కాశీవిశ్వనాథ స్వామి సత్సంగం వారిచే ఫిబ్రవరి 2న మాచర్లలో శ్రీ భగవాన్ గీతాయజ్ఞంలో కోటి నామోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాశీవిశ్వనాథ స్వామి శనివారం తెలిపారు. సాగర్ రింగ్‌రోడ్డు సమీపంలోని శ్రీశైలం రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూర్ణాహుతి, యజ్ఞ నిర్వహణ జరుగుతోందన్నారు. మరిన్ని వివరాల కోసం 8074817374 నంబరును సంప్రదించాలన్నారు.

### చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు



**మాచర్ల:** పట్టణంలో వేంచేసి ఉన్న పల్నాడు విశిష్ట దేవుడు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామికి మూడు రోజుల అభిషేకాల్లో భాగంగా అర్చకుడు అడిగొప్పల సీతారామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారికి శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు అర్చనాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**మాచర్ల రూరల్:** పేద విద్యార్థుల ఆర్థికాభివృద్ధికి తులసి ఎడ్యుకేషనల్ ట్రస్టు చేయూతనిస్తుందని, అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ఉపాధ్యాయ సంఘాలు చూపిస్తున్న చొరవ, కృషి అమూల్యమని శ్రీ తులసి ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ కొనియాడారు. శనివారం మండలంలోని కొప్పునూరు, జమ్మలమడక గ్రామాలలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం వారిచే రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, స్కాలర్‌షిప్‌లను తులసీ ఎడ్యుకేషన్ ట్రస్టు అందిస్తుందన్నారు. స్టడీ మెటీరియల్ తయారీలో ఎస్టీయూ నేతలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. రెండు నెలల పాటు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తామని తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.గంగాధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థుల కోసం రూపొందించిన మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని, అందించిన ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీయూ నాయకులు కృష్ణా నాయక్, జాను, డేవిడ్ విల్సన్, గోవిందరావు, భాస్కర్‌బాబు, కెనడి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ మురళీ కృష్ణ, హెచ్‌ఎం రామారావు

### ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంచొద్దు : సీఐ

**గురజాల:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఏవరైనా ఊరు వదిలి వెళ్లేటప్పుడు ఇంటిలో విలువైన బంగారు వస్తువులు, డబ్బులు ఉంచరాదని సీఐ ఆవుల భాస్కర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఊరు వెళ్లేవారు వారి విలువైన వస్తువులు వారితో పాటు తీసుకువెళ్లడం కానీ, బ్యాంకుల్లో లాకర్‌లో సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. అశ్రద్ధ చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.



# అభివృద్ధి పథంలో మాచర్ల

- పట్టణంలో రెండు జాతీయ రహదారుల నిర్మాణం
- మారిన పట్టణ రూపురేఖలు
- పట్టణంలో నెలకొల్పిన ఆధునిక వైద్యశాలలు



మాచర్ల పట్టణంలో నుంచి వెళుతున్న జాతీయ రహదారి



పల్నాటి బ్రహ్మనాయుడు విగ్రహం

**మాచర్ల రూరల్:** గౌతమ బుద్ధుడు నడయాడిన నేల.. లోహ శిలా యుగం నాటి మానవ జాతి మనుగడ సాగించిన పోతుగడ్డ .. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఘనమైన చరిత్రను సంతరించుకున్న నేల.. పల్నాటి బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మ రెండు కళ్లుగా పల్నాడును పరిపాలించిన తీరు.. పగలు, ప్రతీకారాలు, పంతాలతో ఆత్మగౌరవాన్ని ఎన్నడూ తాకట్టు పెట్టకుండా అందుకోసం ప్రాణాలు సైతం తృణప్రాయంగా వదిలిన పల్నాడు వీరుల పోతుగడ్డ మాచర్ల సీమ. ఘనమైన చరిత్ర, వారసత్వం ఉన్న మాచర్ల సీమ నేడు ఆధునిక సాంకేతిక పరంగా అభివృద్ధి పథంలో పయనిస్తుంది. రెండు రాష్ట్రాలకు చివరిగా ఉన్న నియోజక వర్గం జాతీయ రహదారుల నిర్మాణంతో వాణిజ్య, వ్యాపార రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుంది. గతంలో వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్నా, నేడు పట్టణంలో నేడు రామాటాకీస్ వీధిలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో నిష్ణాతులైన స్పెషలిస్టుల వైద్యులతో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారు. సాగు, తాగు నీరు లేక గతంలో ఇబ్బంది పడిన ఈ ప్రాంత ప్రజలకు నాగార్జున జలాశయం నుంచి స్వచ్ఛమైన నీరందుతోంది. జాతీయ రహదారుల నిర్మాణంతో ఏర్పడిన బైపాస్ రహదారులతో పట్టణ ప్రజల ట్రాఫిక్ కష్టాలు తొలగి పట్టణ శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ వైద్యశాలలు, ప్రముఖ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుతో పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది.



చెన్నకేశవ స్వామి మూలవిరాట్